స్వాతి మాసపత్రిక - జనవరి 2002

# కలలే తీయనివి

ఉదయం ఆరుగంటలయింది. రవి మంచం మీద నుంచి లేచే ప్రయత్నంలో పక్కకి చూశాడు. భార్య గీత కనబడలేదు. మామూలుగా అయితే రవి, 'ఏం చేస్తున్నావురా!' అని ప్రేమగా భార్యని పిలిచేవాడే! కానీ రవి అప్పుడలా చేయలేదు. ముభావంగా మంచం దిగాడు. ఇంట్లోని ఏ గదిలోంచి అతనికి ఏ విధమైన అలికిడీ అందలేదు. అందుకే నెమ్మదిగా - కిచెన్, బాత్ రూమ్,డ్రాయింగ్ రూమ్‌ల వైపు వెళ్ళి చూశాడు. ఎక్కడా అతనికి గీత కన్పడలేదు!!

వీధి తలుపువైపు చూస్తే, అది దగ్గరగా వేసి వుంది. దాంతో అతనికి కంగారు పుట్టింది. కాసేపు అటూ ఇటూ చూసి, లిఫ్ట్‌లో కిందకి దిగి దగ్గరలో వున్న పాలబూత్ వరకు వెళ్ళాడు.

అక్కడ నలుగురయిదుగురు ఆడవాళ్ళు ఉన్నారు గానీ, వాళ్ళలో గీత లేదు. రవి తల వంచుకుని వెనుదిరిగాడు. ఈసారి భయం, అనుమానం అతనితో జతగా నడవసాగాయి.

తిరిగి ఫ్లాట్‌లోకి వెళ్ళి గది గదీ పరీక్షగా చూశాడు. గీత తను ఎక్కడికి వెడుతున్నదీ ఎందుకు వెడుతుననదీ చెప్పే ఉత్తరం రాసి పెట్టి వెళ్లిందేమోనని చూశాడు. అతనికి నిరాశే ఎదురయ్యింది.

సోఫాలో కూలబడి దిక్కులు చూశాడు. నుదురు పట్టుకున్నాడు. అప్పుడు అతనికి తనకీ గీతకీ మధ్య గతరాత్రి జరిగిన ఘటీ గుర్తొచ్చింది. ఇల్లు నడవడం మీద, ఇంటి ఖర్చులు లెఖ్ఖలకు దొరక్కుండా పెరిగి పోవడం మీద, రకరకాలైన లోన్స్ తీసుకొని కొన్న ఫ్లాట్‌కు ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో ఎదురయిన ఇబ్బందులకు కారకులు – 'నువ్వంటే నువ్వని' పరస్పరం తీవ్రంగా వాదించుకున్నారు.

ఏ సహాయం అందించకుండా ఒట్టి ప్రేక్షకులుగా మిగిలిపోయిన ఇరువైపు పెద్దల్నీ గుర్తుచేసుకుని, 'మీ వాళ్లేం చేయలేదుగా?' అంటే, 'నీవాళ్ళేం చేశారని', ఒకళ్ళనొకళ్ళు ఎత్తి పొడుచుకున్నారు. ఆ వాదనలో నాలుగుమాటలు ఎక్కువ మాట్లాడిందీ మామగారిని ముగ్గులోకి లాగింది – రవే...

"నువ్వు నన్ను నమ్మడం లేదు. పైగా మావాళ్లను అనుమానిస్తున్నావ్... డోంట్ స్కోల్డ్ మై పేరెంట్స్" అంటూ గీత కళ్ళను అగ్నిగోళాలు చేసింది....

"నిన్ను ప్రేమించడం పెళ్ళి చేసుకోవడం నా పొరబాటు" అన్నాడు రవి ఆవేశంతో.

"పొరబాటును సరిదిద్దుకుందుకు నీకూ నాకు కూడా అవకాశం వుంది." అంటూ గీత రెచ్చిపోయింది. ఎన్నో అంది.

తనని తను నిందించుకుంది.. ఏడ్చింది!! అలా వాళ్ళిద్దరి మధ్యా మాటలు ఫుట్‌బాల్ బంతుల్లా అటూ ఇటూ తిరిగాయి – చాలారాత్రివరకూ! ఇద్దరూ ఎడమొహం పెడమొహంగా పడుకున్నారు!!

రవి చిరాకుతో సోఫాలోంచి లేచాడు. కానీ ఏం చేయాలో తోచని నిస్సహాయస్థితిలో పడ్డాడు. టీపాయ్ మీద వున్న గిఫ్ట్ పేకెట్ కళ్ళబడింది.

అతనికి అప్పుడు తన మామగారింట్లో ఆ రోజు చిన్నపాటి వ్రతంజరగబోతోందన్న సంగతి గుర్తొచ్చింది... కానీ గీత లేకుండా తను ఫంక్షన్‌కు వెడితే జరిగింది అందరికీ చెప్పవల్సి వస్తుంది. చెబితే అందరూ తనని నిలేస్తారు. కంగారుపడతారు...సరిగ్గా అప్పుడే రవి పక్కనున్న ఫోన్ మోగింది. ఆ ఫోన్‌కాల్ మామగారింటి నుంచి వచ్చింది.

మామగారే తిరిగి ఫంక్షన్ గురించి గుర్తు చేసి, "మీరిద్దరూ వస్తున్నారు కదా" అన్నాడు.

రవి కంగారు పడుతూనే, "సారీ మామయ్యా, రాత్రి విజయవాడ నుంచి మా అమ్మ ఫోన్ చేసింది. మా నాన్నకు హెవీ ఫీవర్ వచ్చిందిట. బి.పి.బాగా రేజయితే హాస్పిటల్లో జేర్పించారుట... నేనూ గీతా ఓ అరగంటలో బయలుదేరి ఆ ఊరు వెళ్ళాలనుకుంటున్నాం" అని చిన్న అబద్ధం ఆడేశాడు.

"అలానా అయ్యో సారీ... సరే మీ నాన్నగారి ఆరోగ్యం ముఖ్యం. ముందు అక్కడకి వెళ్ళి రండి... అవునూ గీతకోసారి ఫోన్ ఇవ్వు..." అనేశాడు అవతలి నుంచి గీత తండ్రి వెంకట్రావు.

"గీత బాత్‌రూమ్‌లో వుంది.... ఆమె చేత మీకు తిరిగి ఫోన్ చేయిస్తాను" అని రవి ఫోన్ పెట్టేశాడు. అయితే మామగారితో చెప్పిన అబద్ధం అతని ఆందోళనని తగ్గించకపోగా దాన్ని రెట్టింపు చేసింది. అందుకే తండ్రికి ఎస్.టి.డీ. చేశాడు. జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

"అలా ఎందుకు చేశావురా ఇడియట్" అన్నాడు కోపంగా అవతలి నుంచి సీతాపతి.

"గీతకి తను ఉద్యోగం చేస్తున్నానని, సంపాదిస్తున్నానని గర్వం... తన డబ్బు గురించి తన ఖర్చుల గురించీ ఆరాలు తీయవద్దంటుంది. దాంతో కోపం వచ్చి బాగా తిట్టాను. నాన్నా"

"ఆ అమ్మాయికి బాగా కోపం వచ్చి ఇంట్లోంచి వెళ్ళిపోయిందంటే అదేం చిన్న విషయం అవదురా... ఆమె పౌరుషంతో ఆవేశంతో ఏ రైలు కిందపడినా హుసేన్‌సాగర్‌లో పడినా కష్టం... అప్పుడు తప్పు నీదవుతుంది. ఇవన్నీ ఆలోచించావా నువ్వు..." అంటూ అవతలి నుంచి ప్రశ్నించాడు. తండ్రి.

"నాన్నా నాకు భయంగా వుంది.... నేను విజయవాడ వచ్చేస్తాను..." అన్నాడు రవి.

"వద్దు... నువ్విక్కడికి వస్తే మాకు ప్రమాదం... ఇంట్లో ఉండలేకపోతే - ఏ స్నేహితుడి ఇంటికో వెళ్ళు. మళ్ళీ నాకు రాత్రి ఫోన్ చెయ్యి..."

రవి ఫోన్ పెట్టేసి గబగబా స్నానం చేసి, బట్టలు మార్చుకుని తను రెండు రోజులు ఆఫీసుకు రావడం లేదని ఆఫీసు మేనేజర్‌కు ఇన్‌ఫారమ్ చేశాడు. బయటకు వచ్చి తన చేతక్ ఎక్కాడు.

తండ్రి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఏకాఎకిన టాంక్‌బండ్‌కు వెళ్ళి ఓ పక్కగా స్కూటర్ ఆపి- గ్రిల్స్ దాకా వెళ్ళి విశాలమైన ఆ చెరువునీ గట్లనీ చూశాడు. అంతా మామూలుగానే వుంది.

అయినా తిరిగి బండి ఎక్కి నెక్లెస్‌రోడ్డు దాకా వెళ్ళి తిరిగి వెనక్కి వచ్చి, లుంబినీ పార్క్ దాటి ఓ చోట ఆగాడు. తిరిగి నీటి వైపూ గట్ల వైపు చూశాడు. జేబులోంచి సిగరెట్ పేకెట్ తెరిచాడు. స్ట్రీట్‌లైట్ పోల్‌ను ఆనుకుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

సరిగ్గా అప్పుడే ఓ రాజ్‌దూత్ వచ్చి ఆగింది. రవి వెనక్కి తిరిగి చూసే లోపునే ఓ

పాతికేళ్ళ యువకుడు అతని దగ్గరగా వచ్చి "మీరు రవి కుమార్ కదూ" అంటూ చేయి కలిపాడు.

రవి అతన్ని పోల్చుకోలేకపోయాడు.

కార్గోపేంట్... ఫ్రోలైన్ టీ షర్ట్... కళ్ళకు సోలార్ కళ్ళజోడు... మనిషి - తూర్పు పడమర దేశాల సంఘీభావానికి ప్రతీకలా కన్పించాడు.

"యార్... నేను విప్లవ్‌కుమార్‌ని... సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో మనం ఇంటర్ చదివాం. నన్ను గుర్తుపట్టలేదా?" అని అడిగాడు.

"నువ్వా ... చాలా మారిపోయావు. హఠాత్తుగా ఇక్కడ ... ఎలా ప్రత్యక్షమయ్యావ్?"

"రెండేళ్ళుగా కేలిఫోర్నియాలో ఉంటున్నాను. సెలవుల మీద మా ఊరెళ్తూ దారిలో ఇక్కడ ఆగాను... తాజ్‌లో దిగాను" అంటూ విప్లవ్ తన గురించి చెప్పి, "కమాన్ యార్... వుయ్ విల్ షేర్ గాసిప్, అండ్ టిఫిన్, కాఫీస్" అంటూ ఆహ్వానించాడు.

ఇద్దరూ సికిందరాబాద్ బేల్సన్ తాజ్‌కు వెళ్ళారు.

టిఫిన్, కాఫీ తీసుకున్నారు. వాళ్ళ కబుర్లలో చదువులు, ఉద్యోగాలు, ఐ.టి. రంగంలో తెలుగువాళ్ళు సాధించిన ప్రగతి, అమెరికాలో జీవనం, అక్కడి ఆంధ్రదేశపు యువతీయువకుల ప్రణయాలు, పెళ్ళిళ్ళు - అన్నీ దొర్లాయి.

"నా పెళ్ళి అయి ఏడాది అయింది. నా భార్య కూడా ఉద్యోగం చేస్తుంది." అన్నాడు రవి తన గురించిన వివరాలు క్లుప్తంగా చెబుతూ...

"నీది ప్రేమ వివాహమా?"

"అవును"

"ఇద్దరూ పూర్తి అవగాహనతో కలిసి వుంటున్నారా?" అని అడిగాడతను.

"అటూ, ఇటూ" అన్నాడు చిన్నగా రవి.

"ఇప్పుడు ఇండియాలో చాలా ప్రేమవివాహాలు ఫెయిల్ అవుతున్నాయనీ - దానికితోడు మన ఆంధ్రదేశంలో డౌరీప్రాబ్లమ్ ఎక్కువగా ఉందనీ- ముఖ్యంగా మన యూత్‌కి కూడా డబ్బు పిచ్చి ముదిరి - పెద్దవాళ్ళతో చేతులు కలిపి వైఫ్సను యాగీ చేస్తారని - ఇక్కడి నుంచి వచ్చినవాళ్ళు కథలుగా చెప్తారు... నిజమేనా?" అని అడిగాడు.

రవి మాట్లాడలేదు.

"ఐ.టి. విప్లవం వచ్చినా మన ఎంగ్‌స్టర్స్ అత్తారింటి డబ్బుకోసం ఇంకా పాకులాడ్డం రిచెడిటీ అవదా??" - అన్నాడు విప్లవకుమార్.

"నువ్వా పెళ్ళి చేసుకోబోతున్నావుగా... మీ వాళ్ళు కట్నం తీసుకోకుండా నీ పెళ్ళి చేస్తారంటావా? చూద్దాం..." అన్నాడు వేళాకోళంగా రవి.

"ఐ హేట్ - డౌరీ. నాకు మా వాళ్ళు నాలుగయిదు సంబంధాలు చూశారు రవీ. అయితే నా ఉద్దేశం వేరు. ఈ ఊళ్ళో నాతో చదివిన ఓ అమ్మాయి వుండేది. ఆమె అంటే

నాకు ప్రాణం. ఆమెను వెదికి పట్టుకుందామనే నేనీ ఊరు వచ్చాను. తెలుసా? నువ్వు నమ్మకపోవచ్చు."

"మెచ్చిన అమ్మాయిని వెదకడం దేనికి? ఏం మీ ఇద్దరికీ కాంటాక్ట్స్‌లేవా?"

"నా స్నేహితురాలి తండ్రి ఉద్యోగం పేర చాలా ఊళ్ళు మారారు. నేను ఐ.ఐ.టి. చేస్తూ కాన్పూర్‌లో ఉండిపోయాను. తర్వాత అమెరికా వెళ్ళిపోయాను. ఆమె గురించీ ఆయన గురించీ ఇక్కడి ఫ్రెండ్స్‌తో చెప్పినా ఎవరూ కరెక్ట్ ఇన్ఫర్మేషన్ ఇవ్వలేదు" అని విప్లవ్ కాసేపు ఆగి, "రవీ – ఈ విషయంలో నీ వైఫ్ నాకేమయినా సహాయం చేగలదేమో కనుక్కో, డిటేయిల్స్ ఇస్తాను. నేను ఇదే హోటల్లో మరో రెండు రోజులు వుంటాను. నీ అడ్రసు ఇస్తే నేనే నిన్ను కలుస్తాను..." అన్నాడు.

"అయ్యో.. నా వైఫ్ ఈ ఉదయమే విజయవాడ వెళ్లింది... మా నాన్నగారికి ఒంట్లో బాగోలేదు. నేనూ రాత్రికి అక్కడికి వెడుతున్నాను. మేం తిరిగి రావడానికి రెండు మూడు రోజులు పట్టవచ్చు..."

"దట్సాల్ రైట్... ఇటీజ్ మై బేడ్‌లక్" అంటూ విప్లవ్ తన విజిటింగ్ కార్డ్ రవికి ఇచ్చాడు... రవికూడా జేబులోంచి తన వి.సి. విప్లవ్‌కిచ్చాడు.

"థాంక్యూ నేను వెడతాను" అని రవి లేచాడు. విప్లవ్ రవితో లిఫ్ట్‌లో కిందకి వెళ్ళి అతను వెళ్లేంత వరకూ నిలబడి – తిరిగి తన రూమ్‌లోకి వచ్చాడు. కాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాడు. టేబుల్ మీద పుస్తకాలు తిరగేశాడు. ఏవీ చదవబుద్ధికాలేదు. పదేళ్ళనాడు తాము వుండే మలక్‌పేట్‌లోని బ్రహ్మానందరెడ్డినగర్ గుర్తొచ్చింది.

అటు, ఆ ప్రాంతానికి వెళ్ళాలనిపించింది. సోఫాలోంచి లేచాడు. విప్లవ్ అద్దం ముందు నిలబడి తనను తాను చూసుకుని క్రాఫ్ దువ్వుకుని – రూమ్ నుంచి బయటకు వచ్చి లిఫ్ట్ దగ్గర నిలబడ్డాడు. ఇంతలో అటుగా వున్న ఓ రూమ్ నుంచి ఒకామె లిఫ్ట్ కోసం విప్లవ్‌కు దగ్గరగా వచ్చి నిలబడింది. విప్లవ్ ఆమె వైపు చూశాడు. తిరిగి చూశాడు.

ఎక్కడో చూసిన మొహం... ఎప్పుడో తన పక్కన నడిచిన స్నేహితురాలు, తను ఎదురుచూసిన వ్యక్తి.... విప్లవ్ ఆమెను గీతగా గుర్తుపట్టాడు. అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి. హృదయం ఉప్పొంగిపోయింది. వేల మైళ్ళు దూరం నుంచి చేసిన ప్రస్థానం ఫలించినందుకు మనసూ, కోరిన మనిషి కళ్ళ ముందు చూసినందుకు అంగాంగాలూ ఆనందపారవశ్యంతో ఊగిపోయాయి.

అయినా విప్లవ్ తన ఆనందాన్ని అదుపులో పెట్టుకుని, మర్యాదగా "నేను విప్లవ్ కుమార్‌ని. మనం మలక్‌పేటలోని, బ్రహ్మానందరెడ్డి నగర్ బి–బ్లాక్స్‌లో ఉండేవాళ్ళం. గుర్తుందా... బహుశా నీ పేరు గీత అయ్యుండాలి. మే ఐ కరెక్ట్?"

"అరే. నువ్వా ప్లవ్.. వాటే సర్‌ప్రయిజ్... ఎక్కడ ఉంటున్నావ్? నిన్ను చూసి ఏడెనిమిది ఏళ్ళు అయ్యింది. చాలా పొడుగయ్యావ్... తెల్లబడ్డావ్.. ఏంచేస్తోన్నట్టు?" అంటూ గుక్క

తిప్పుకోకుండా ప్రశ్నలు కురిపించింది, గీత.

విప్లవ్ తన గురించిన వివరాలు క్లుప్తంగా చెప్పి, "నేను ఈ హోటల్లోనే పై ఫ్లోర్‌లో వుంటున్నాను. ఏమీ అనుకోకుండా నువ్వు నా రూమ్‌కు వస్తే కాసేపు మాట్లాడుకుందాం.." అన్నాడు.

"అలానే – పద"

ఇంతలో లిఫ్ట్ కింద నుంచి పైకి వచ్చింది. ఇద్దరూ విప్లవ్ రూమ్‌లోకి వెళ్ళారు.

"మా ఆఫీసరుగారు తన కూతురు పెళ్ళి ఈ హోటల్లో ఏర్పాటు చేశాడు. పెళ్ళి ఎనిమిది గంటలకు జరిగింది. లంచ్ చేసి వెళ్ళిపోదామనుకుంటున్నాను. మా కొలీగ్ కోసం కిందకి వెడుతున్నాను. నువ్వు కనిపించావు" అంది.

విప్లవ్ బెల్‌నొక్కి సర్వీస్‌బాయ్‌ని పిలిచాడు.

"నాకేం వద్దు సుమా" అంది గీత.

"ఫర్ మై ప్లజర్... ఒట్టి కాఫీ మాత్రమే తెప్పిస్తాను" అన్నాడు.

సర్వీసు బాయ్ లోపలికి వచ్చి విప్లవ్ చెప్పింది విని బయటకు వెళ్ళిపోయాడు.

విప్లవ్ తన గురించి తను ఇండియా ఎందుకు వచ్చిందీ చెప్పాడు. ఇద్దరూ స్కూల్ రోజుల్నీ, ఆనాటి క్లాస్‌మేట్స్‌ని ఒక్కొక్కరిని పేరుపేరునా గుర్తు చేసుకుని కాసేపు మాట్లాడుకున్నారు.

"అయితే సహధర్మచారిణి కోసం ఇంతదూరం వచ్చావన్నమాట. అమెరికాలో ఉన్న మనవాళ్ళు ఎవరూ నచ్చలేదా నీకు?"

"అది కాదు... నేను నా స్నేహితురాల్ని వెదుక్కోవడం కోసం ఈ నగరం వచ్చాను. ఆమె కనబడి నా ప్రపోజల్స్ ఒ.కే. చేస్తే నా జీవితాశయం నెరవేరినట్టే..." అని చెప్పాడతను.

"అయితే ఆ స్వప్న సుందరి గురించిన వివరాలు ఏమన్నా చెప్పు.... నేను ఎరిగిన మనిషయితే మధ్యవర్తిత్వం చేస్తాను" అంది గీత.

అప్పటికే విప్లవ్ చూడకూడదనుకుంటూనే గీతను చాలాసార్లు కళ్ళ చివర్ల నుంచి చూశాడు. మనిషి పొడగరి – విశాల నేత్రాలు – పొడవాటి మెడ... దృఢమైన గుండెలు, పక్కపాపిడి. మెడలో ఒకే గొలుసు. ఓ చేతికి రెండు బంగారు గాజులు... మరో చేతికి రిస్ట్‌వాచీ. ఒంటి పసిమిరంగుకు వన్నెతెచ్చే వాయిల్ చీర... కాళ్ళకు స్లిప్పర్స్ లోంచి కాలివేళ్ళకు ఉన్న వెండిమట్టెలు కూడా కన్పించాయి – విప్లవ్‌కి... అంతే.. అప్పుడు విప్లవ్‌కుమార్‌కి నోట మాట రాలేదు. హృదయం జరగరానిది జరిగినట్టు ఉలిక్కిపడింది. అతను తిరిగి తేరుకుందుకు క్షణాలే పట్టినా – అవి కాలాన్ని కాదని అతన్ని బాధపెట్టాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఏం లేదు గీతా" అతను తన కంఠంలోని మార్పునీ, కళ్ళు బేలగా నీళ్ళు తిప్పుకునే ప్రయత్నం చేయబోగా ఆ అవస్థని పసిగట్టి సింక్ దగ్గరకు వెళ్ళి ముఖం కడుక్కుని,

చెమర్చిన కళ్ళను మాయచేయడానికి టవల్‌తో వాటిని అద్దుకున్నాడు.

గీత విప్లవ్ పరిస్థితి గమనించి, "నీకు ఒంట్లో బాగాలేదా, పోనీ డాక్టర్ దగ్గరకు వెళ్ళు... నేను వెడతాను" అంది.

"ఏం లేదు. ఇప్పుడు సర్దుకుంది. అవునూ" అని సంశయంగా ఆగిపోయాడు.

"ఏమిటీ?"

"మీది ఎరేంజ్డ్ మేరేజా – లవ్ మేరేజా?"

"రెండూను. మేం ఇద్దరం ప్రేమించుకున్నాం. మా అత్తగారు చాలా గొడవచేసి గానీ పెళ్ళికి ఒప్పుకోలేదు" అని చెప్పింది గీత.

"పెళ్ళి అయిన తర్వాత కూడా మీరు అదే ప్రేమను కాపాడుకుంటూ స్నేహితులుగా ఉండగల్గుతున్నారా?"

"ఏం లేదు. ఈ దేశంలో ప్రేమలో పడ్డ ఆడపిల్లలకు – తన ప్రేమికుడి నిజస్వరూపం పెళ్ళి అయిన తర్వాతే తెలిసొస్తుంది..."

"అంటే?"

"ఈ దేశంలో మేల్ డామినేషన్ వేళ్ళు తన్ని వుంది. అది ఇప్పటి మీ తరంవాళ్ళకి కూడా వారసత్వంగా వస్తూనే వుంది. మావారి ఆ కాంప్లెక్స్‌కు నేనూ ఓ విక్టిమ్‌నే" అన్నది గీత.

"అవునా?"

"మా పెళ్ళయి ఏడాది అయ్యింది. పూర్వం మా మధ్య ఉండే చనువు, స్నేహం నెమ్మదిగా హరించుకుపోతున్నాయి.... నాకు అన్పిస్తోంది – నేను పెళ్ళిచేసుకుని పొరబాటు చేశానేమోనని.

ఈ తెలుగునాట ప్రతీ ఆడపిల్లా తనదనే. డబ్బు వెనకేసుకు గానీ పెళ్ళికి తలూఎ కూడదు. ఆడపిల్లకు ఆర్థికస్వాతంత్ర్యమే పుష్టి. అప్పుడే ఆమెకు గౌరవం దక్కుతుంది..."

విప్లవ్ వింటున్నాడు.

"అవును విప్లవ్... నేను ఈ ఏడాదిలో నా మొగుడితో చాలా విసిగిపోయాను. ఎటైనా వెళ్ళిపోవాలనిపిస్తుంది. ఎటో తెలియదు" అని విప్లవ్ మొహంలోకి చూసి, "మిత్రమా, నాకు అమెరికాలో ఉద్యోగం చూసిపెట్టు... నేను అక్కడికి వచ్చేస్తాను. ఒకటి రెండు ఏళ్ళు దూరంగా వుంటే మా ఇద్దరికీ సుఖంగా ఉంటుందనిపిస్తుంది...." అన్నది.

విప్లవ్ చిన్నగా నవ్వేసి, "గీతా! ఇవన్నీ విన్న తర్వాత మీ ఇంటికి వచ్చి మీ ఆయన్ని చూడాలనిపిస్తోంది... రానా?" అన్నాడు.

"నిన్న రాత్రి మేం ఇద్దరం బాగా పోట్లాడుకున్నాం... పొద్దున్నే అతగాడికి చెప్పా పెట్టకుండా ఈ పెళ్ళివంకన బయటపడ్డాను. నేను కనబడక ఈ పాటికే నా మొగుడు గెంతులు వేస్తూంటాడు. నువ్వు మా ఇంటికి మరోసారి వద్దువులే...."

విప్లవ్ గీత కళ్ళల్లోకి చూశాడు. అతనికి ఆమె మాటలూ, ఆమాటల్లోని నిజాయితీ అతన్ని కొత్తగా తాకుతున్నట్టనిపించింది... అందుకే, "ఇంత తేలిగ్గా నీ మనసులో మాటలు చాలా ఏళ్ళ తర్వాత కలిసిన నాకు ఎలా చెప్పగల్గుతున్నావ్ గీతా? నేనంటే నీకు నమ్మకమా?" అని అడిగేశాడు.

"నువ్వు ఇప్పటికి కూడా చిన్నప్పటి విప్లవ్‌లానే కన్పిస్తున్నావ్... లేత వయసులో ఏర్పడే స్నేహాలకు అంత బలం వుంటుందేమో? అందుకే నిన్ను చూడగానే బడ బడా వాగేస్తున్నాను. అయినా నువ్వు నాకేం అపకారం చేస్తావని నేను భయపడాలి?"అంది గీత ఫ్రాంక్‌గా.

"నామీద నీ గురికి చాలా థాంక్స్ గీతా... చదువులూ, ఆపైన జీవితాలు మనల్ని దూరం చేసినా మన పెర్సనాలిటీస్ మనల్ని దగ్గర చేశాయి.... నాకు చాలా ఆనందంగా ఉంది గీతా.. " అనేశాడు... అలా అంటున్నప్పుడు విప్లవ్ కంఠం జీరబోయింది...

"మరి నేను వెడతాను విప్లవ్..." అని గీత సోఫాలోంచి లేచింది. విప్లవ్ గీతతో పాటు కిందకి వెళ్ళి ఆమెను ఆటోలో ఎక్కించి, 'బై' అంటూ చేతులు కలిపాడు. తిరిగి రూమ్‌లోకి వచ్చాడు.

అక్కడ ఉన్న నిశ్శబ్దం కొత్తగా కన్పిస్తూ వుంటే బెడ్‌మీద వాలి పైకి చూస్తూ ఉండిపోయాడు. గీత అనే స్నేహితురాలు మాట్లాడిన మాటలు సజీవంగా ఆ గదిలో తేలి ఆడుతుంటే అతను అదోలా అయిపోయాడు. అలాగే పక్కకి తిరిగాడు.

టీపాయ్ మీద వున్న లెటర్‌పేడ్‌లో కాగితాలు ఫేన్‌గాలికి ఎగురుతున్నాయి. దాన్ని సరిజేయబోతుంటే మొదటి లీఫ్‌మీది గీత రాసిన ఎడ్రసు కన్పించింది. చదివాడు. అనుమానం వేసి జేబులోంచి రవికుమార్ ఇచ్చిన విజిటింగ్ కార్డ్ తీసి చూశాడు - అప్పుడు విప్లవ్‌కు ఓ కొత్తనిజం తెలిసింది. దాంతో అతన్ని ఆశ్చర్యం, ఆపైన బాధ, ఇంకా ఇంకా భయం చుట్టుముట్టాయి...

అలానే జేబులోంచి పర్స్ తీసి దానిలోపలి ఫోల్డర్‌లోని గీతఫోటో వైపు చూస్తూ ఉండిపోయాడు. అతని కళ్ళు తిరిగి చెమర్చాయి. హృదయంలో ఆరాటం స్థాయిని దాటి చెలరేగింది. తనని తను ఓదార్చుకోవడం తెలియని విప్లవ్ - యుద్ధంలో శత్రువు చేతికి చిక్కిన యోధుడిలా మారాడు! మనసు పరి పరి విధాల పోసాగింది. బలహీనమవుతోంది!!

❖ ❖ ❖

కాలింగ్‌బెల్ మోగితే గుమ్మం అవతల నుంచున్న భర్తని చూసి "సారీ రవీ" అంది గీత. రవి తల ఊపి అలవోకగా సోఫాలో కూర్చున్నాడు. గీత ఓ కప్పుతో కాఫీతెచ్చి రవికి ఇచ్చింది.

"నేను చెప్పకుండా వెళ్ళినందుకు నువ్వు కంగారుపడ్డావు కదూ.... నిన్న రాత్రి నువ్వు నన్ను ఎంత బాధించావో తెలుసా? అప్పుడే వెళ్ళి హుసేన్ సాగర్‌లో పడదామని

పించింది..."

"నీ కోపం ఆవేశం నాకు తెలుసు గీతా. అలాగే నీ ప్రేమా తెలుసు. తప్పు నాదే. నేను చాలా భయపడ్డాను. నీకోసం ఊరంతా వెదికాను." అంటూ మామగారికీ, తండ్రికి చెప్పిన అబద్ధం గురించి చెప్పాడు. గీత అంతా విని నవ్వేసింది.

"తాజ్‌లో జరిగే పెళ్ళి ఇన్విటేషన్ గుర్తొచ్చి అటు వెళ్ళాను. ఏమీ అనుకోకు. ఇద్దరం జరిగింది మర్చిపోదాం. సరేనా?" అన్నది.

"సరే - పెళ్ళి బాగా జరిగిందా?"

"రవీ పెళ్ళి సంగతి అటుంచు. అక్కడ అనుకోకుండా విప్లవ్ అని నా చిన్ననాటి స్నేహితుడు కలిశాడు. ఇద్దరం చాలా చాలా మాట్లాడుకున్నాం. దాంతోనే నా మనసు కాస్త తెరిపినపడింది...."

"విప్లవా?" అన్నాడు ఆశ్చర్యంగా రవి.

"పూర్వం వాళ్ళూ మేం ఒకేచోట ఉండేవాళ్ళం. చాలా మంచివాడు. అమెరికాలో మంచి ఉద్యోగం చేస్తున్నాట్ట. మనిషిలో ఏ భేషజాలూ లేవు...."

"అతను నాకూ స్నేహితుడే.... మేం ఇద్దరం ఇంటర్‌లో క్లాస్‌మేట్స్‌ము. నిన్న నీ గురించి వెదుకుతూ వుంటే నన్ను గుర్తుపట్టి తాజ్‌కు తీసుకువెళ్ళాడు"

"అలానా?" అనిగీత అనుమానంగా రవిని చూసి, "మన గురించి నువ్వు అతనికి చెప్పావా? నేనయితే నీ గురించి చెప్పాను. మనింటికి వస్తానన్నాడు. నువ్వు ఏమనుకుంటావోనని నేను వద్దన్నాను. అసలే మనం ఎడమొహం పెడమొహంగా ఉన్నాంగా...." అంటూ గీత అతని భుజం మీద తలవాల్చింది. రవి చిన్నగా నవ్వాడు. గీత తన తండ్రికి ఫోన్‌చేసి ఏవేవో చెప్పి భర్తని గట్టున పడేసింది.

సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది. ఆ ఫోన్ సికిందరాబాద్ బెల్సన్ తాజ్ మేనేజర్ చేశాడు. తన వివరాలు చెబుతూ, "సార్ - మీరూ గీత అనే మీ వైఫ్ ఓసారి మా హోటల్‌కు రావల్సి వుంటుంది... ఎందుకంటే రూమ్‌నెంబర్ టూ హండ్రెడ్‌లో వుండే విప్లవ్‌కుమార్ అనే ఆయన ఏవో డ్రగ్స్ తీసుకుని ఉండాలి. సీరియస్ అయ్యింది. రాత్రి సర్వీసు టైములో ఈ విషయం మాకు తెలిసింది. పోలీసులకు ఇన్‌ఫామ్ చేశాం. ప్రస్తుతం ఆయన గాంధీ హాస్పిటల్‌లో ఉన్నారు....." అంటూ చెప్పాడు.

"అలానా?" అంటూ ఫోన్ పెట్టేసి రవి-గీత మొహంలోకి చూస్తూ జరిగింది చెప్పాడు.

"అరే ఏం చేద్దాం రవీ... ఎలా జరిగిందో ఇది" అంది గీత పేనిక్‌గా.

రవీ గీతా ముందు హోటల్‌కి వెళ్ళి మేనేజర్‌తో మాట్లాడి అక్కడి నుంచి గాంధీ హాస్పిటల్‌కు వెళ్ళారు. ఓ స్పెషల్ రూమ్‌లో విప్లవ్ మంచం మీద పడుకుని ఉన్నాడు. పక్కనే స్టాండూ దాని నుంచి వేళ్ళాడుతున్న సెలైన్‌బాటిల్ కన్పించాయి.

విప్లవ్ సిగ్గుతో తలపక్కకి తిప్పుకున్నాడు. ఇద్దరి స్నేహితులనీ చూసి, "ఏమయింది

విప్లవ్... ఏం జరిగింది?" అంది ఆప్యాయంగా గీత.

"టెన్షన్ ఫీలయినప్పుడు నిద్రమాత్రలు వేసుకోవడం నాకు అలవాటే. కానీ ఒకటి రెండు ఎక్కువ మింగాననుకుంటాను.. అందుకే ఇంత సీను అయ్యింది" అన్నాడు లేని నవ్వుని బలవంతాన తెచ్చుకుంటూ విప్లవ్.

"సరే విప్లవ్... నథింగ్ టు వర్రీ... యు ఆర్ సేఫ్... కానీ మేం ఓసారి రామ్‌గోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాల్సి వుంది. మీ హోటల్ వాళ్ళు కంగారుపడి వాళ్ళకి ఫోన్ చేస్తే వాళ్ళు మేనేజర్ దగ్గర స్టేట్‌మెంట్ తీసుకున్నార్ట. నీ రూమ్‌లో వెదికి మా ఎడ్రసులు పట్టుకెళ్ళారట. పోలీసువాళ్ళు దాన్ని పెద్దగా చేయకుండా మేం వాళ్ళను కలిసి మాట్లాడి వస్తాం.... ఆ తర్వాత నిన్ను కూడా మా ఇంటికి తీసుకువెడతాం సరేనా?" అన్నాడు రవి – విప్లవ్‌తో.

విప్లవ్ తల ఊపాడు. రవీ గీతా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి డ్యూటీలోఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని కలిశారు. తాము చెప్పవల్సింది చెప్పారు.

ఇనస్పెక్టర్ తన డ్యూటీలో భాగంగా – ఎన్నో రకాలుగా ప్రశ్నించి, అన్నిటినీ రికార్డు చేసుకున్నాడు. లోకం తీరూ, యువకుల పోకడలూ తెలిసిన వాడిలా చిన్నపాటి ఉపన్యాసం ఇచ్చి, తన డ్రాయర్ తెరిచి "ఇదిగో మీ విప్లవ్‌కుమార్ పర్స్... ఇందులో బాగా మన కరెన్సీ వుంది. ఏవేవో విజిటింగ్ కార్డ్స్, అడ్రసులూ ఉన్నాయి... ఆపైన అందులో ఓ అమ్మాయి ఫోటో ఉంది. వీటన్నిటికీ రిసీట్ ఇచ్చి – వీటిని మీరు తీసుకువెళ్ళొచ్చు" అన్నాడు.

రవి ఐదు నిముషాల్లో వారికి కావల్సిన ఫార్మాలిటీస్ పూర్తి చేశాడు. ఇద్దరూ బయటకు వచ్చారు. రవి పర్స్ తీసి చూశాడు. అందులో పర్స్ ఫోల్డర్‌లో ఫొటో కూడా చూశాడు. రవి అది చూసి ఆశ్చర్యపోయాడు. ఆ ఫొటో గీతది...

గీత పదిహేను – పదహారేళ్ళ వయసులో తీయించుకున్న ఫొటో... రవి ఏం మాట్లాడకుండా పర్స్, గీతకు అందించాడు. గీత కూడా పర్స్‌లోని తనఫొటో చూసి ఆశ్చర్యపోయింది. ఆమెకు అప్పుడు –అంతా అర్థమయినట్టుగా వుంది.

మాటలు రాని స్థితి అంటే ఎలా వుంటుందో ఆ క్షణాలూ, వాటి స్వరూపం మాత్రం ఎలాంటిదో మొదటిసారి తెలిసొచ్చింది.... ఆఖరిగా విప్లవ్ హృదయం – ఆ హృదయంలో దాగింది తనేననీ తెలిసింది.... కళ్ళు నీళ్ళ పాలవుతూంటే రవికి దగ్గరగా వెళ్ళి "రవీ! నేను ఇంట్లోంచి బయటకు వెళ్ళకుండా ఉండవల్సింది. వెళ్ళినా విప్లవ్‌ని కలవకుండా ఉన్నా బాగుండేది. కలిసి అతన్ని తన కలల్లో తను బ్రతకకుండా చేశానేమో" అంది....

రవి గీతకు జవాబు చెప్పలేదు. గీత ఎక్కిన తర్వాత స్కూటర్ స్టార్ట్ చేశాడు!!